
ఊహాకందని
పరిణామం

వినుత కిదంతా ఎబ్బెట్టుగా తోచింది. తను వెళుతున్నట్టు తెలిసికూడా ఎందు కీ ఏర్పాటు? ఏం పట్టనట్టు కూర్చుంది. హృదయంలో ఏదో సన్నటి పోటు. కుముదిని వచ్చి చూచి పామును చూచి వెనక్కి వెళ్ళినట్టు వెళ్ళిపోయింది.

“కూర్చో. ఆలస్యమై పోతుంది.” రవి మామూలుగా అన్నాడు. వచ్చి కూర్చుంది.


ముగ్గురూ తింటున్నా, వాతావరణం బిగిసినట్టుంది. అత్త అంది: “వచ్చేప్పుడు నాలుగు రకాల కూరగాయలు పట్టుకురా. త్వరగా వచ్చెయ్యి. వీడితో నేవేగలేను.”

అత్త కేసి చురుకుగా చూచింది. ఆమె వడ్డనలో నిమగ్నమైంది. వాడికి బామ్మ దగ్గరే చేరిక. ఎందు కిలా అంటూంది? కుముదిని ఊరుకోలేదు. తను ఉద్యోగం చేయ నవసరం లేకపోతే ప్రతి ఒక్క విషయాన్ని తేలికగా తీసుకోవని కిష్టం లేకపోయినా, తేలికగా తీసుకుని మౌనం దాల్చేది. తన పని తాను చేసుకు పోయేది. కానీ, ఇకపై ఇలా ఉండటానికి వీల్లేదు. ఈ నాటి నించి తన ఉనికిలో మార్పు రావాలి.

“ఈ ఇంటర్వ్యూ పేరుకేనండీ. అంతా ముందరే సెలెక్ట్ చేసేశారు. పది నిమిషాల్లో వదిలేస్తారు. ఒంటి గంట కంతా వచ్చేస్తాను.”

“అయితే, రవీ, వినుతకు వెంకటప్పయ్య తప్పక ఇస్తాడా?”

“ఇస్తా నన్నాడు. చూద్దాం.” పొడిగా అన్నాడు.



రవి, వినుత బయలుదేరినా, కుముదిని వాళ్ళతో వెళ్ళలేదు.

• • •

ఇంటర్వ్యూ అయిన మూడవనాడు వినుతకు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ వచ్చాయి. జూనియర్ కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా అపాయింట్ అయింది.

వినుతకు ఎంతో సంతోషం వేసింది.

ఈ మూడు రోజులు ఆ నాటి సంఘటనను మరిచిపోయినట్లే వ్యవహరించింది వినుత. కుముదిని మాత్రం అంటీ ముట్టనట్టూరుకుంటూంది.

మరునాడు జాయి నవ్వాలి.

బాబును నిద్ర పుచ్చి భర్త దగ్గరి కొచ్చింది.

"అంత ఉత్సాహంగా లేవు. ఏమిటి సంగతి?" రవి వినుత చేతి నందుకుని అడిగాడు.

"ఏం లేదు. అత్తగారిలో మార్పు కనిపిస్తూంది. కుముదినిది తప్పైనా, అదేదో నేనే మార్చి చెప్పినట్లుంది ఆవిడకు. కూతురి మీద మమకారం ఎంతోగాని, నాకీ బాధలు తప్ప వేమో?"

"దీని కో చిన్న ఆన్సర్ ఉంది. కూతురి ఆడబిడ్డతనం తేలిపోయిందే, వదిన దృష్టిలో ఆడబిడ్డ కున్న విలువ పోయిందే నన్న కోపం నీ మీద చూపించాలన్న ప్రయత్నమే. అంతకన్నా ఏం లేదు. కూతు రెంత తెలివి తక్కువగా బయట పడిపోయిందో అన్న బాధ."

"అయి ఉండవచ్చు." ఆమె భర్త కళ్ళలోకి చూచింది.

అతడి కళ్ళలోని లోతుల్ని చూస్తున్నట్లు, గ్రహింపు కందని భావాల్ని పరిశీలిస్తున్నట్లు చూస్తూంది.

"భోజనా లయ్యాక ఓ ప్రశ్న అడగాలి."

"ఇప్పుడే అడుగు." నవ్వుతూ అన్నాడు.

"నా చేత ఉద్యోగ మెందుకు చేయిస్తున్నారు?"


రవి ఉలికిపాటుతో లేచి కూర్చున్నాడు. "అదేం ప్రశ్న, వినూ? మన పరిస్థితులు నీకు తెలియవా?"

"తెలుసు కానీ, మీ నోట వినాలని."

"ఒకటి — ఇల్లు గడవాలి; రెండు — కుముదినికి పెళ్ళి చెయ్యాలి; మూడు — మనం కొంత డబ్బు సేవ్ చేసుకోవాలి. దీప ముండగానే ఇల్లు చక్కబెట్టుకోవటం ఉత్తమం కాదా?"

"అవును. కానీ, పని చేసేది నేను. నా ఇష్టాయిష్టాల ప్రసక్తి లేదా?" సీరియస్‌గా అడిగింది.

రవి చిన్న వెకిలి నవ్వొకటి నవ్వాడు.



మద్రాసు లోని క్రోంపేట రాధానగర్‌లో తెలుగు ఉగాది నాడు 'తెలుగు అసోసియేషన్' కు పల్లవపురం మునిసిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ శ్రీ వి. జానకిరామన్ ప్రారంభోత్సవం చేశారు. తెలుగు సంఘ ఆవశ్యకత గురించి, అధ్యక్షత వహించిన శ్రీ కె. ఎస్. సౌందరరాజన్, పి. యస్. ఆర్. నాయుడు, ఎం. ఎస్. శాస్త్రి, ఎస్. ఆర్. వెంకట సుబ్రహ్మణ్యం మొదలైన వారు ప్రస్తావించారు. పాఠశాలల్లో తెలుగు తరగతులు ప్రారంభించాలని సెక్రటరీ శ్రీ ఎస్. రామమూర్తి చెప్పారు. అన్నమాచార్య కీర్తనలు ప్రచారం చేయడానికై సంగీత తరగతులు నిర్వహించాలని అన్నారు. శ్రీ వి. వి. గిరి, శ్రీ సి. అన్నారావులు సందేశాలు పంపారు.

"పిచ్చి వినూ! ఎందుకు లేదు? నా ఇష్టమే నీ ఇష్టం కాదా?"

"అన్నింటిలో — దీనిలో తప్ప."

రవి అవాక్కయి పోయాడు.

"నా ఉద్దేశంలో, ఉద్యోగం చేస్తున్నాను కాబట్టి, నా ఖర్చులు పోను మిగిలింది సేవింగ్సులోకి వెళ్ళిపోవాలి. నేను ఇంట్లో ఉండను కాబట్టి బాబు భారం ఎవరు వహిస్తారు? అత్తగారు. చూద్దాం. ఒక వేళ నారికి భారమైతే ఓ పిల్లను పెట్టుకోవాలి."

"అమ్మకు వాడు భారమా? ఏమిటి, ఇలా మాట్లాడుతున్నావు?" కాస్త కోపం కూడా వచ్చింది రవికి.

వినుత నవ్వింది. "లేవండి. భోజనం చేద్దాం."

రాత్రిళ్ళు వారిద్దరికీ తినటం అలవాటు. భోజనం చేసి వస్తుంటే కుముదిని అడిగింది: "అన్నయ్యా! ఫీజు కట్టాలి. రెండు వంద లవుతుంది."

"ఫీజు రెండు వందలా?" ఆశ్చర్యంతో అడిగాడు.

వినుత మౌనంగా నించుని ఏం జవాబు చెబుతుందోనని చూస్తూంది.

"అంతా అజంతాకు ఎక్స్‌కర్షన్ వెళుతున్నారు. . ."

"ఓ. . ."

"కానీ, కుముదా, అజంతా చూట్టానికి మీ ఆడ నేస్తాలతో వెళితే లాభం లేదు. మా తమ్ముడు రానీయ్ — వెళుదువు కాని. మీ అన్నయ్య నీ పెళ్ళికి తొందరపడుతున్నారులే. నూట ఏభై రూపాయలు ఎందుకన్నా పని కొస్తాయి."

రవి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

కుముదిని ఉక్రోషంతో కన్నీళ్ళు కుక్కుకుంటూ తల్లి దగ్గరకు వెళ్ళింది. ఆమెతో బాటు వినుతకూడా వెళ్ళింది.

"కుముదా! చిన్న పిల్లవు కావు. కష్ట సుఖాల్ని అర్థం చేసుకోవాలమ్మా. నూటఏభై రూపాయ లంటే మాటలా?"

"ఊరుకోవే, తల్లీ! మీ నాన్నగారి చేతిలో నాలుగు రాళ్ళు లేకపోబట్టే కదా ఎవరినో అడగవలసి వచ్చింది? మీ నాన్నగారు రిటైర్డ్ అవకపోయి ఉంటే నిన్ను ఢిల్లీకే పంపేవారు, పెద్దవాళ్ళ సకల సౌకర్యాలతో. . ."

"ఎందుకండీ అలా అంటారు? ఇప్పుడు కుముదకు జరిగినంతగా వాళ్ళ కెక్కడ! మా నాన్నగారిదికూడా మామయ్యగారి లాగానే బడిపంతులు పనే. పై ఆదాయం లేని బ్రతుకులు. ఆస్తి పాస్తులేవు. వారిద్దరి సంతానమైన మేము ఎంతో పొదుపుగా జీవించాము. ఆ సంగతి మీకూ తెలుసు. కుముద ఏదో అనుభవించటం లేదని అనవసరంగా బాధ పడకండి. మనం జాగ్రత్తగా ఉంటే కుముదకు ఏ లోటూ ఉండదు."

"మా జాగ్రత్తలు మా కున్నాయి. నీ కెందుకులే పొదుపు ఉద్యమం?" ఆమె అక్కడి నించి వెళ్ళిపోయింది.

వినుత కుముదను నిలేసింది.

"ఆ రోజుల్లో... అన్నలకు, అక్కలకు ఎలా జరిగిందో నీకు జ్ఞాపకం లేదూ? ఇటువంటి కుటుంబం లాంటి దానిలో పుట్టి పెరిగిన నాకు మా చిన్నతనం ఎంత స్పష్టంగా ఉండేదో జ్ఞాపకమే. మీ రంతా నాకు కొత్త కాదు. చిన్నప్పటి నించి చూస్తూనే ఉన్నాను. మీ అన్నయ్యకు ఏభై ఇచ్చి హైదరాబాదు పంపలేకపోయారు మామయ్య. అన్నయ్యకు ఐదు వందలు వస్తాయని అనుకుంటున్నావు కాని, అన్ని ఖర్చులూ లెక్క వేస్తే మిగిలింది ఎంతో నీకు తెలియదు, కుముదా? పుట్టింట్లో ఉన్నప్పుడెన్నో కోరికలు ఉంటాయి. తీరకపోతే బాధ పడకూడదని మనస్తత్వం కూడా పెంపొందించుకోవాలి."

కుముద మాట్లాడలేదు. అక్కడి నించి విసవిస నడిచి వెళ్ళిపోయింది. ఆ నడకలోని నిరసనను చూచి దీర్ఘంగా ఊపిరి విడిచింది వినుత.

ఎప్పటి లాగానే ఆవేళ సూర్యోదయమైంది.


వినుత మామూలుగా చేసే పనులు చేసింది. సుబ్బులు రావటంతో ఎన్నో పనులు తగ్గిపోయాయి.

ఆ తరవాత గాని అసలు రంగు బయట పడలేదు.

అత్తగారు మూడు టిఫిన్ డబ్బాలున్నా, రెండే సర్దింది. వినుత మౌనంగా తన డబ్బాలో రెండు బిస్కెట్లు, ఒక అరటిపండు పెట్టుకుంది. గిన్నెలో ఉప్మా మిగల్చ లేదు మరి.

బాబుకు ముద్దు పెట్టి అత్తగారికి చెప్పి గుమ్మం దిగింది.

"ఓయ్, వినుతా!" అన్న అత్తగారి కేక విని వెనక్కి తిరిగి చూచింది.




“అయ్యో — మాకు సినిమాలు కూడానా? ఏదో ఎలుగురూ కలిస్తే నాలుగు మాటల్లోపడిపోయాము. కుముద ఫ్రెండ్ అట. బలవంతంగా లాక్కెళ్ళింది.”

వినుత అసహ్యంతో చూస్తూ అంది: “మీ రిద్దరు లోపలికి రాగానే గుప్పన సిగరెట్ వాసన కొడితేనూ సినిమా కెంచి వచ్చా రనుకున్నాను. పేరంటం బాగా అయిందా?”

“ఆఁ” అని పొడిగా జవాబు వచ్చింది.

వాళ్ళిద్దరూ ఆ అబద్ధ మెందుకాడారో వినుత కర్థంకాలేదు. వయిటింట్లో చప్పుడైంది. అంటే, ఇద్దరు భోజనం చేస్తున్నా రన్న మాట.

వినుత తన నోట్స్ చూచుకుంటూ మంచంలో లీనమై పోయింది.

కుముద చదువుకో లేదు. నిద్ర పోయింది.

ఆవేళ పదకొండు గంటలకు పక్క జేరితే, అంత అలసటగా లేదు వినుతకు. ఎంతో రిలీవ్డ్‌గా ఫీలయింది.

మరునటి రోజు భోజనం చేస్తూ సుబ్బులు సంగతి చెప్పాడు.

“అదెందుకూ? దానికేం చేతనవుతుంది?”

“మరేం చెయ్యనమ్మా? సుబ్బులు చిన్న పిల్లేం కాదు. వాడు ఆడుకుంటూంటే కాస్త కనిపెట్టి ఉండాలి. అంతేకదా?”

“అయితే, పిల్లాడిని దానిమీద వదిలి వెళతావా?” కోపంగా అంది. ఆమె ఊహించింది అది కాదు. కోడలు, కొడుకు తనను బతిమాలాలి అనుకుంది.

రవికి కోపం వచ్చింది. “నిన్న నువ్వేగా కోపంగా అనేసి వెళ్ళావు — రేపటి నించి ఏం చేసుకుంటారో — అని? మరీ ఒక్క పగలైనా గడువు ఇవ్వక పోతివి. ఇంకా నయం. అదైనా ఒప్పుకుంది. ముప్ఫై అడిగితే, పాతిక అన్నాను.”

“బాబోయ్! పాతికే? పాచి పని కన్నా అధ్వాన్నమే. ఒక్క మాట నాకు చెప్పక పోయావూ?”

“అమ్మా! నువ్వేం మాట్లాడుతున్నావో నీకే తెలియటం లేదు.”

ఇంత జరిగిందా నిన్న? అని విస్తుపోయి చూస్తూండి పోయింది వినుత.

ఆమె మనసు పాతిక — పాతిక అని కొట్టుకు లాడుతూంది. కుముద తాము అనుకున్నట్టు జరక్క పోయేసరికి ముఖం మాడ్చుకుని భోజనం చేస్తూంది.

రవి లేచాడు. “వాడికి మధ్యాహ్నం అన్నం, ఆ తరవాత ఏదైనా ఇవ్వటం నీ బాధ్యతే. అది భారం కాదనుకుంటాను” అని చేతులు కడుక్కోవటానికి వెళ్ళి పోయాడు.

ఎప్పటి లాగానే రెండు టిఫిన్ డబ్బాలే ఉన్నాయి.

అత్తగారు మారలేదనుకుంది.

“ఆ రెండు చెరొకటి పట్టుకెళ్ళండి. నా కేమీ అక్కర్లేదు” అని వెళ్ళి పోయాడు.

తల్లి హృదయం చివుక్కు మన్నది. ఆ వేళ బజ్జీలు పెట్టింది. ఏం చెయ్య గలదు?

వినుత ఒక్క మాట మాట్లాడలేదు.

ఆ సాయంత్రం రవితో వినుత రాలేదు. కాస్త ఆలస్యంగా వస్తుందేమో అనుకున్నారు.

మామూలుగానే కాఫీకి పెట్టారు.

రవి అన్నాడు: “వినుత ఆలస్యంగా వస్తుంది. నిన్నలా కాకుండా ఈ వేళ నాకుకూడా కాఫీ తీసుకురా, కుముదా!”

బాబును ఎత్తుకుని కాస్సేపు వాడితో ఆడుకుని, ముస్తాబు చేసి సుబ్బులుతో పార్కుకు పంపించాడు.

అలవాటుగా ముందర గదిలో పేపర్ తీసుకుని ఈజీఛెయిర్‌లో పడుకున్నాడు.

కుముద కాఫీ గ్లాసు అందించింది.

“అన్నయ్యా! మరి నేను అజంతాకు వెళ్ళద్దా?” గోముగా అడిగింది.

తల్లి గబగబ వచ్చి గోడవారగా కూర్చుంది.

“ఆ ఎక్స్ట్రా ఖర్చు భరించటం కష్టం, కుముదా! వద్దని చెప్పాను కదా?”

“ఎక్కడి నించైనా తీసుకుని రా, రవీ! నెలాఖరుకు తీర్చెయ్యవచ్చు. ఏదో పాపం, సరదా పడుతూంది.” తల్లి సలహా ఇచ్చింది.

“తరవాత మాత్రం ఎలా తీర్చగలం? తాహతుకు మించిన ఖర్చు చేయటం నా కిష్టం లేదు.”

“వదిన జీతం వస్తుందిగా?” ఆత్రంగా అంది కుముద.

కాఫీ తాగటం ఆపు చేసి చెల్లి వైపు ఆదోలా చూశాడు. ఆ చూపులోని భావాల్ని గ్రహించింది కాబోలు తల వంచుకుంది.

“వెయ్యన్ని చిల్లర వస్తే అది తాహతుకు మించిన ఖర్చు కిందికి ఎలా వస్తుంది? నా మాట కాదనకురా.”

“వద్దమ్మా. నువ్వుకూడా అర్థం చేసుకోలేకపోతున్నావు. ఈ డబ్బు ఉత్త కాగితాలే. దానికి విలువ లేదు.”

ఆమె వెళ్ళిపోయింది.

కుముద కోపంతో అంగణంలోకి వెళ్ళిపోయింది.

తల్లి వంట చేయటానికి రాలేదు. కుముధ ఏదో పుస్తకం పట్టుకుని కూర్చుంది.

సరిగ్గా ఏడు గంటలకు కుముదను పిలిచాడు.

“ఈవేళ వంట నువ్వు చెయ్యి. నిన్న నేను చేశాను. రేపు వదిన. ఎల్లుండి అమ్మ. అలా వంతు వేసుకోకపోతే లాభం లేనట్టుంది.”

కుముద కోపంతో అయిష్టంగా చూచింది.

“నేను, అన్నయ్యలు వండుకుని తిని చదువుకున్నాము. మా కలిసవు. అవసరాలు కూడా తీరేవి కావు. నాలుగు రోజుల్లో ఒక్కసారి నీ వంతుకే బాధ పడాలా, కుముదా? ఇప్పుడు వదిన వచ్చి వండి పెట్టాలనా? నీ మన సెలా ఒప్పుతుంది? అమ్మ తనకేం పట్టనట్టు కూర్చుంది.”

“అవున్నా. ఎవరికి వారు ఉద్యోగాలు, చదువులంటూ వెళ్ళిపోతే నేనేనా రెక్కలు ముక్కలయ్యేలా పని చేసి అంతా సిద్ధంగా ఉంచటానికి?”

“అమ్మా! ఈ కష్టం వినుత పని లోకి ఎక్కనంత వరకు కష్టంగా తోచ లేదా? రెండు పూటలా వండేదానివి. కాఫీ, ఫలహారం అందించేదానివి. బాబును కనిపెట్టి చూచేదానివి. ఈ నాలుగు రోజుల్లో ఎంత మారిపోయావమ్మా! నేను పని చేసి అలిసి వస్తే, కుముద చదివి అలిసి వస్తే, నువ్వు పని చేసి అలిసిపోతే... వినుత మాత్రం ఉద్యోగం చేసి హాయిగా మహారాణిలా వస్తుంది. సరే, నీ ఇష్టం. నిన్ను చెయ్యమని ఇక్కడ ఎవరూ బలవంతం చెయ్యరు. నువ్వు నిశ్చింతగా, విశ్రాంతిగా ఉంటే చాలు.”

రవి వంట గదిలో కెళ్ళాడు. తల్లి సైగ చేయటంతో కుముద కూర్చున్న దగ్గిరే ఉండిపోయింది.

పది నిమిషాలు చూచాడు. రాలేదు. అతడి క్రోధం తారాజువ్వలా లేచింది. అతి ప్రయాసతో అణుచుకుని పిండి తడిపి, వంకాయలు తరిగాడు. కాస్త ఉప్పు వేసే సవతలికి రాగానే సుబ్బులు బాబును అప్పగించి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఇంటి కొచ్చిన భార్య ముఖం చూచి ఎంతో జాలి పడ్డాడు. ఆ ముఖంలో అలసట కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది.

ఆమె అలవాటుగా చీరె మార్చుకుని పడుకుంది.

రవి కాఫీ తెచ్చి ఆమె కిచ్చాడు. ఆరాధనతో భర్త వేపు చూచింది. "మీరు?"

"అంతా అయిపోయింది. ఇది తిను" అని ఒక అరటి పండు ఇచ్చాడు.

"మీ ముఖం బాగా తీసిపోయింది. అలా పార్కు వేపు వెళ్ళి రండి. లేదా విశ్రాంతిగా పడుకోండి. కాస్సే పాగి వంట చేస్తాను."

రవి తయారై వచ్చి మెల్లగా అన్నాడు: "అమ్మ కోపంగా ఉంది. సమాసంగా సర్దుకు పో. కుముద ఏమైనా అనగలదు. గప్‌చిప్‌గా ఉండిపో."

"ఎందు కంటుంది?"

"కాలేజీ మానిపించాను" అని గబగబ వెళ్ళిపోయాడు.

"నిజమా?! ఎందుకు?" ఆ ప్రశ్నలు గాలిలో కలిసి పోయాయి. దాని అర్థం బోధపడటానికి ఆట్టే సేపు పట్టలేదు.

రవి ఎంత మంచివాడు! తన భర్త తోడు ఉండబట్టి వెన్నెకు రాగలుగు తూంది. లేకపోతే తెల్లవారి మూడు గంటలకు లేచినా, అన్ని పనులు చేసుకో లేదు. ఆమె ఓ గంట సేపు కళ్ళు మూసు కుని పడుకుంది.

వంటింట్లోకి వెడుతుంటే కుముద వచ్చింది.

"ఇంకేం, వదినా? నా చదువు మాన్పించావు! అన్నయ్య అనుకుంటు న్నాడు—ఇలా బెదిరిస్తే దారి కొస్తానని. ఇంట్లో మీ వంటలక్కలా ఉండాలని ఆశ కాబోలు. హూ" అంటూ దీర్ఘం తీసింది.

"మీ అన్నయ్య ఇలా చేస్తాడని నాకు తెలియదు, కుముదా! నువ్వు నమ్మినా, నమ్మక పోయినా ఇది నిజం."

కుముద గొణుగుతూనే ఉంది. వినుతకు అంటిస్తూనే ఉంది. వినుత మాట్లాడలేదు. పెదాలు బిగబట్టి, చెవుడు నటిస్తూ వంటపనిలో నిమగ్నమైంది.

అన్నీ రావటం చూచి చరచర వెళ్ళి పోయింది.

రవి సహాయం చేయబోయాడు. వినుత అక్కర్లే దన్నది. అత్తగారు నోరెత్తలేదేమా? అని ఆశ్చర్యపోయింది. కుముదను భోజనానికి పిలిస్తే మొదటి పిలుపుకి రాలేదు. రెండో పిలుపుకి వచ్చింది.

అంతా నిశ్శబ్దంగా భోజనం చేశారు. రవి తల్లిని పిలిచాడు.

"నా కక్కర్లేదు" అంది.

"ఎందుకమ్మా? తిని వెళ్ళు. చల్లారి పోతుంది."

ఆమె రాలేదు.

వినుత వెళ్ళి పిలిచింది.

"నా కొద్దు" అంది విసుగ్గా.

"ఆకలి వేసినప్పుడు తినం డత్తయ్యా! హార్లిక్సు తెస్తాను. తాగండి."

వినుత గ్లాసు నిండా కలుపుకుని వచ్చింది. ఆమెకు అందించి వచ్చేసింది. ఏకాంతంగా దొరికినప్పుడు అంది: "ఎందు కిలా చేశారు?"

"చేయవలసి వచ్చింది. మరో మార్గం కనిపించలేదు."

"అందరూ న న్ననుకుంటారు."

"అనుకోనియ్. వారి వ్యర్థపు మాటలు మన సమస్యలను తీర్చవు."

"కుముద విషయం ఏం చెయ్య దలిచారు?"

"వెంటనే పెళ్ళి చేసి పంపాలి. రేపటి నించి వరుడి కోసం చూడాలి."

"పోనీ, అంతదాకా కాలేజీకి వెళితే ఏం?"

"ఏమీ లేదు. నా కిష్టం లేదు."

"కోపంతో తీసుకున్న నిర్ణయ మేమో! కాస్త ఆలోచించి. . ."

"లేదు, వినూ! కాస్త కాదు, బాగానే ఆలోచించాను. ఒక్క వంద రూపాయలు తన కోసం ఖర్చు చేయలేక పోయామట. ఇప్పుడు అవుతున్న ఖర్చు చేయలేక ఎవరు భరిస్తున్నారు! నువ్వు నచ్చజెప్పను చూడకు. నా మాటకు తిరుగు లేదు. నీకు వంట కష్టం వస్తుంది. మన కున్న ఆర్థికమైన ఇబ్బందులలో ఒకవంటావి డను పెట్టి భరించలేము. అందుకని నేను సహాయం చేస్తాను."

వినుత మాట్లాడలేదు. చాలా సేపు నిద్ర రాక మంచంలో పొర్లుతూనే ఉంది.

నాలుగు రోజులు గడిచినా తల్లి కాని, కుముద కాని సహాయం చేయా లనుకో లేదు.

ఐదవ రోజు తెల్లవారక ముందే రవి తండ్రి రిక్షాలోంచి దిగారు.

తలుపు తీసిన వినుత సాదరంగా ఆహ్వానించింది. అతడి రాక ఆమెలో ఆశ్చర్యాన్ని కలిగించినా, బయట పడ లేదు. చిన్న జంపఖానా చుట్ట, ఓ తాటాకు బుట్ట మాత్రం తెచ్చాడు.

"ఏమమ్మా! ఇంకా ఎవరూ లేవ లేదా?"

"లేదండి, మామయ్యా! వేడి నీళ్ళు సిద్ధంగా ఉన్నాయి."

"పెట్టమ్మా. చాలా అలసటగా ఉంది."

అతడు గదిలోకి తొంగి చూశాడు. భార్య, కూతురు ఇంకా పడుకునే ఉన్నారు.

స్నానాల గదిలోకి వెడుతుంటే రవి ఎదురొచ్చి కుశల ప్రశ్నలు వేశాడు. తండ్రి పొడి పొడిగా జవా బిచ్చి వెళ్ళాడు.

స్నానాల గది తలుపు మూసుకున్నాక భార్య చెవిలో గొణిగాడు: "బహుశః అన్నయ్య పంపించేశాడేమో? నాలుగు రోజుల కని వస్తే అలా ఉండదు."

స్నానం చేసి రాగానే వినుత కాఫీ గ్లాసు అందించింది. ఒక గుక్క తాగి అన్నాడు: "మీ అన్నయ్య, వాడి డాక్టరు ఏవో మందుల కేసులో ఇరుక్కు న్నారు. సస్పెండ్ చేశారు. అందువల్ల వారికి లేమి లేకపోయినా, భయపడి నన్ను పంపేశారు. ఇలాంటి పరిస్థితుల్లో నా ఖర్చు భరించలే మనుకున్నారు. అవునూ, వాళ్ళిద్దరికి కులాసాగా లేదా?"

"బాగానే ఉన్నారు. అమ్మకు వంట చేయాలని లేదు. కుముదకు విశ్రాంతి కావాలట. అందుకని కాలేజీ మానిపిం చేశాను."

తండ్రి తాగటం ఆపు చేసి నిశ్చేష్టుడై విన్నాడు.

"వినుత పని చేస్తోందిగా?"

"అవును."

"అయితే, ఈ విధంగా నువ్వు వ్యవహ రించటంలో అర్థమేమిటి, రవీ? నీ మీద నాకు నమ్మక ముంది. ఏది చేసినా, ఆలోచించి న్యాయంగా చేస్తావు. చెప్పు."

ఆయన అరుగు మీద కూర్చున్నాడు. రవి అన్ని విషయాలూ తు. చ. తప్పకుండా చెప్పాడు.

"ఇలాంటి సమయంలో మళ్ళీ నా దొక భారం మీకు."

"అలా అనకండి, నాన్నా! ఏదో ఒకటి అందరం కలిపి తిందాం. మీ రేం బెంగ పెట్టుకోకండి."

ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. కళ్ళు వాల్చేసుకున్నాడు.

"నీ విలా అంటావని తెలుసు, నాయనా! అందుకే ధైర్యంగా కట్టు బట్టలతో రాగలిగాను."

తండ్రి, కొడుకులు అక్కడే కూర్చుని కూరగాయలు తరుగుతున్నారు. మధ్యలో ప్రశ్నించాడు రవి.

"నాన్నా! నేను చెప్పిన దంతా నమ్మారా? అతిశయోక్తిగా చేశా నను కుంటున్నారా?"

"లేదు, రవీ! నమ్ముతున్నాను. మీ అమ్మ ఇలా ఆలస్యంగా లేవటమే ఋజువు."

వినుత గబగబ వంట చేస్తోంది.

బాబు లేచి రాగానే ఆయన చేరదీసి బడిలో కూర్చుండబెట్టుకున్నాడు. వాడు ముద్దు ముద్దుగా తాత అంటుంటే పరవశించి పోయాడు.

నిద్ర లేచి ఇవతలి కొస్తున్న కుముద తండ్రిని చూచి సంతోషంతో, 'అమ్మోవ్! నా న్నొచ్చాడు' అంటూ తండ్రిని సమీపించింది.

ఆయన తిరస్కారంగా చూస్తూండి పోయాడు.

భార్య వచ్చి ఎంతో సంతోషంతో పలకరించింది.

ముభావంగా జవా బిచ్చాడు.

"అలా ఉన్నారేం? ఏం జరిగింది?" గాభరాగా అడిగింది.

"జరగవలసింది అక్కడేం జరగ లేదు. అక్కడ ఏది జరిగినా, ఆశ్చర్య పడక్కర్లేదు. ఆ మనుషు లలాంటి వారు. జరగకూడనిది ఇక్కడ జరిగితే ఆశ్చర్యంగా ఉంది."

ఆమె వెకిలిగా నవ్వింది. "ఏదో నలతగా ఉంటే పడుకున్నాను."

"నీ సంగతి సరే. చదువుకునే పిల్ల కుముద కేమైంది?"

అదను దొరికింది, అక్కసు వెళ్ళ బోసుకుంది కుముద. "చదువు మానెయ్యమన్నాడు అన్నయ్య. నన్ను చదివించటానికి డబ్బు లేదట. ఇంట్లో ఉంటే వాళ్ళ నౌకర్లా అన్ని పనులు చేసి అమర్చుతా ననుకున్నారు. వాళ్ళకు కావలసింది అదే. చూడు, నాన్నా" అంది గోముగా, గాద్గదికంగా.

"పోనీలే, అమ్మా. . ." అన్నాడే తడవు ఏదో ఏకరువు పెట్టాలనుకుంది కాని, తండ్రి వ్యవధి ఇవ్వలేదు.

"అయితే, ఇప్పుడు అన్న, వదిన నీ నౌకర్లన్న మాట. వదిన రెండు పూటలా వండి వడ్డిస్తోంది. అన్నయ్యకూడా ఇంటి పనుల్లో సాయం చేస్తున్నాడు. శభాష్! ఇద్దరు నౌకర్లు మీకు. . . సరే కాని, ఎందు కొచ్చావని అడగరేం?"

చీరె భుజాన వేసుకుని వెడుతున్న తల్లి చటుక్కున ఆగింది. "అడిగానే అనుకుని చెప్పండి."

"వాడేమో కేసులో ఇరుక్కున్నాడు. సస్పెండ్ చేశారు. వాడి మనస్సేమీ బాగాలేదు. నీ కోడలికా ఆరోగ్యం బాగా లేదు. వంటకు, ఇల్లు సర్దుకోవటానికి చాలా ఇబ్బందిగా ఉందట. నిన్ను పంప మన్నాడు. కుముదకూడా ఖాళీగా ఉంది కదా? కూడా తీసుకెళ్ళు. అక్కడ మీ అవసరం ఎంతైనా ఉంది."

ఆ మాట వినగానే తల్లీ కూతుళ్ళు అవాక్కయి పోయారు. ఇలా జరుగుతుం దేమిటి?

అక్కడ అన్నయ్య, వదిన తన కింత అన్నం ఊరక పెడతారా? పనివాళ్ళూ ఉండరు. ఇంటి చాకిరి చేయాలి. కాఫీ, టిఫిన్లు లేవు. ఏ కాస్త పండు దొరికినా,


వదిన ఇష్టం వచ్చినట్లు తిడుతుంది. పోలీసులా కాపలా కాస్తుంది. ఒక్క సినిమా ముచ్చట లేదు. అసలు తనూ, తల్లీ కాస్సేపు సరదాగా కూర్చుని మాట్లాడుకోవటానికికూడా వీల్లేదు. ఆమె వాక్ప్రవాహానికి అడ్డు లేదు. అన్నయ్య ఆమె దాసుడు. ఆమె చెప్పిందే వేదవాక్యం. ఒకనాడు చిన్నన్నయ్య ఇచ్చిన డబ్బుతో ఇంటి కొచ్చిన మూటల వాడి దగ్గర ఇరవై రూపాయలకు నైలాన్ చీర కొనుక్కుంది. ఆ చీరె చూడగానే ఆమె క్రోధం విజృంభించింది. 'ఆ చీరె కట్టుకుని మా పరువు నిలపటానికే . . .' అని వెంటనే తరిమేసినట్లే పంపేసింది. అన్నయ్యకూడా రాలేదు. ఆ రావటం రావటం మళ్ళీ వెళ్ళలేదు. ఆ చిన్న కారణంతో తమ బాధ్యత వది లించుకున్నారు. . . కుముద ఆలోచన లీ విధంగా ఉన్నాయి.

తల్లి బాత్‌రూమ్‌లో కెళ్ళి తల పోసుకుంది. ఒంటి మీద పడుతూన్న నీటితో కన్నీరు కలిసి పోయింది. అక్కడ తను వంటలక్క కన్నా అధ్వాన్నం. ఇష్టంగా పెట్టుకుని తినటానికికూడా వీలులేదు. కోడలు ఒక్క పని ముట్టు కోదు. కనీసం తన పిల్లల బాగోగులు కూడా చూచుకోదు. అన్నింటికి పేర్లు పెట్టి వెధవ గోల, వెధవ సంత అంటూ అసహ్యమైన విశేషణాలను స్వేచ్ఛగా వాడుతుంది. అదను దొరికి నప్పుడంతా తిట్టి పోస్తుంది. 'ఇక్కడ ఉంటే కుముదకు పెళ్ళి చేస్తా మనుకోకండి. ఆ బాధ్యతలు మా కొద్దు. ఎక్కడికైనా వెళ్ళిపోయి చేసుకోండి.' రెండోవా డేమన్నాడు? 'నీ కోడలు పని కెళ్ళి వస్తూందమ్మా. ఓపికున్నంతలో ఏదో వండుకుని తింటాము. ఓపిక లేకపోతే ఏ పండో తిని పడుకుంటాము. మీ రిద్దరూ ఉంటే ఇబ్బంది. అంతేకాదు, కుముదకు పెళ్ళి చెయ్యాలి. నా కిలాంటి వేమీ తెలియవు. పెద్దన్నయ్యకు మంచి అనుభవం ఉంది. అక్కడికే వెళ్ళండి' అంటూ మూడో రోజే బండెక్కించాడు. మళ్ళీ పెద్ద కొడుకు దగ్గర కెళ్ళవలసిన అగత్యం కలగకుండా చేశాడు రవి. చేజే తులా చేసుకుందా— భగవంతుడన్న వాడుంటే ఇలా జరక్కుండా పోతుందా? తమకు తగిన శాస్తి జరుగుతూంది. కుముద నాటిన విషబీజాలని తెలిసికూడా వాటికి నీరు పోసి పెంచింది. ఆ తీగెల ఉచ్చులో దిగబడిపోయింది.

స్నానం ముగించి ముభావంగా బయటి కొచ్చింది.

కోడలు కాఫీ గ్లాసు అందిస్తూంటే మౌనంగా అందుకుంది.

"వంటంతా అయింది. ఈ వేళ రమ్మన్నప్పుడు రావటానికి జత



చేదోడు చిత్రం— సి. హెచ్. జయలక్ష్మి (గుంటూరు)

ఓ అరగంట ముందుగా వెళ్ళాలం డత్తయ్యా! మామయ్య గారికి వడ్డిం చండి. వెళ్ళొస్తాను, మామయ్యా" అంది.

"నువ్వు భోజనం చెయ్యలేదా, వినుతా?"

"ఫరవాలేదు. టైమ్ లేదు. ఈ డబ్బాలో కాస్త పెరుగన్నం పెట్టు కున్నాను."

వినుత హడావిడిగా డ్రెస్ చేసుకుని వెళ్ళిపోయింది.

టైమ్ ఎనిమిదిన్నర.

"పాపం!" అన్నా డా పెద్దమనిషి.

భార్య దెస చిరాకు పడుతూ చూచాడు.

"భోజనం చేసి సర్దుకోండి. రైలెక్కించి వస్తాను."

"వాడు పొమ్మన్నప్పుడు పోవడానికి, రమ్మన్నప్పుడు రావటానికి జత గాళ్ళమా?" అం దామె.

"సొంత మనుకున్న చోట స్వంతమని జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా ప్రవ ర్తించటం చేత కాని సీకు, నీ కూతురుకు జీతగాళ్ళ మాదిరిగా చూచుకునే వాళ్ళు అయితేనే సరిపోతారు. పదండి. వాడి కింద పడి ఉండండి. అవసరమైతే పిలిపించు కున్నా, మా మీద వాడు అన్యాయమేమీ ఒలకపొయ్యడు."

"నాన్నా!" అన్నాడు రవి బాధగా.

"మ ఫ్వూరుకో, రవీ! నువ్వు భోజనం చేసి వెళ్ళు. వాడు టిక్కెట్టుకుకూడా డబ్బు లివ్వలేదు. పాసెంజర్‌కు పది చాలు. ఇచ్చి వెళ్ళు."

రవి కిదేమీ అర్థం కాలేదు. డబ్బు లిచ్చి వెళ్ళిపోయాడు.

"నేను వెళ్ళను, నాన్నా" అని ఏడ్చి మొత్తుకున్నా, తండ్రి కుముదను ప్రయా ణం చేశాడు. ఇద్దర్నీ కూర్చో పెట్టి అన్నాడు: "తిరిగి రావాలన్నా మీకు టిక్కెట్టుకు డబ్బు లేదు." ఆయన విరగబడి నవ్వుతూంటే రైలు కదిలింది.

ఆమె చేతిలో రెండు రూపాయ లుంచుతూ, "రిక్షాకు" అన్నాడు.

సాయంత్రం తిరిగొచ్చిన రవితో అన్నాడు: "రేపు సాయంత్రం స్టేషన్ కెళ్ళి వాళ్ళను పిలుచుకొస్తాను."

రవి ఆశ్చర్యంతో తండ్రి దెస చూచాడు.

"రవీ, నాయనా! ముప్పై రూపా యలు ఖర్చు కానీయ్. వారికి ముప్పై లక్షల విలువ చేసే అనుభవం రానీయ్."

"నాన్నా! ఎంత పని చేశారు! అన్నయ్య వదిన వాళ్ళిద్దర్నీ. . ."

"ఏమేమో అంటాడు. నన్ను తిట్టు కుంటాడు. నేను ఎందు కీ అబద్ధం చెప్పి పంపానో వాడి కర్థం కాదు. ఆ కోడలు బహుశః తిరుగు బండికే ప్రయా ణం కట్టించ జూస్తుంది. తరిమినట్లే వచ్చేస్తారు. అప్పటికి అన్నీ అర్థ మౌతాయి."

"నాన్నా! అంత పెద్ద శిక్ష నా? నువ్వే వారిద్దరికి పరిస్థితులను బోధపరిచి మార్చినట్లైతే. . ."

"ఊహుఁ. . . మారరు. మూడేళ్ళ క్రితం ఇద్దరన్నయ్యల దగ్గర ఎలా ఉన్నది మరిచిపోయారు. 'ఇక్కడ తమ ఇష్టప్రకారం మసలుతూ, తమ స్వంత ఇల్లనుకున్నారు. నిన్ను, వినుతను పరాయిగా చూచారు. ఓమారు అదంతా జ్ఞాపకానికి రానీయ్. అన్నీ చక్కబడ తాయి. రేపటి నించి సుబ్బులు బాబును ఆడించక్కర్లేదు. నేనే చూచుకుంటాను. అంతేకాదు, రేపటినించీ వరుడి కోసం వెదకాలి. . . రవీ... అన్నట్లు, ట్యూషన్లు మొదలు పెడతాను. . ."

"నాన్నా, మీ కెందు కీ శ్రమ?"

"శ్రమ కాదు. ఈ శరీరంలో ఓపిక ఉన్నంత వరకు నీ కోసం, వినుత, బాబు కోసం ఏదైనా చేయాలని ఉంది. అది ఆరోగ్యకరంకూడా. ఏదో వ్యాపకం పెట్టు కోవాలి. మనిషిలోని మంచిని పరీక్షకు పెట్టి, వారిలోని సహనాన్ని నాశనం చెయ్యకూడదనే సత్యాన్ని మీ అమ్మ, చెల్లి గ్రహిస్తారు. ఇక ఈ గృహంలో ఏ సమస్యలకు తావు ఉండదు. . . పద, వినుత వచ్చే లోపల కాఫీ, ఏదైనా ఫలహారం రెడీగా ఉంచుదాం."

తండ్రి మాటలకు విస్మయపోయి వింటున్నాడు రవి. *